మొత్తంమీద యీ ఫిఫ్టీయియర్సులో వండర్‌ఫుల్ డెవలప్‌మెంట్సు వచ్చిపడ్డాయి"

తరవాత లేడీగిరీశం (పూర్వాశ్రమంలో పూట కూళ్లమ్మ) యిలా అన్నారు :

" నాయనా, నువ్వెవ్వరోగాని—మా కాలంలో యీ అబ్బరాలు లేవుసుమీ. అప్పుడు పదిలంగా ఓ నాలుగు పూటకూళ్ల యిళ్లుండేవి. ఇప్పుడు కలి ముండి పోయింది. అరవదేశంనుండి అయ్యర్లొచ్చిపడి—వీళ్ల మ్మకడుపు కాలా—వీధివీధికీ హోటళ్లే. ఇట్టే అర్ధ రూపాయిపుచ్చుకుని కొలతకూళ్లు పెడుతున్నారు. వీళ్ల కేం పోయే కాలమోగాని. కలిగాక యేమిటి నాయనా యిదీ? "

లేడీ గిరీశంగారు చేసిన పైప్రకటననుబట్టి, గిరీశం గారు ఆహారపరిస్థితిపై చెయ్యనున్న ప్రకటనపై అనేక విధాలుగా ఊహలు చెలరేగుతున్నవి.

తరవాత కాపీలు తియ్యగా, పూటకూళ్లమ్మను శ్రీ గిరీశంగారు విడోమేరేజ్ చేసుకున్నారనీ, అన్న పూర్ణాదేవి అని నామకరణం చేశారనీ రూఢిగా తెలిసింది.

మిస్టర్ అసిరిగాడు యిలా అభిభాషించారు:

"అవుదాన్లుగోరు (స్వర్గీయ లుబ్ధావధాన్లుగారు) కాలంసేసినాక, నాను గిరీశంబాబుగారిదగ్గిర కొలువుకి కుదురుకున్నాను. సచ్చీదాకా ఆబాబుపాదాలే నమ్ముకుని పడుంటాను......యీకాలంలో నావొంటివోళ్లు సుట్టముక్కకి వోసిపోతున్నారు. కూడూ నేక, సుట్ట ముక్కా నేక బతకడం ఎనాగ ?" అన్నారు.

తరవాత రామప్పంతులుగారి గురించి ప్రశ్నించగా—"మా గొప్ప పెబువు! మీనాచ్చమ్మకాడికి వొచ్చినప్పుడల్లా నాకు రూపాయి బరాతంయిచ్చీవోడు.. ఇప్పుడా మీనాచ్చమ్మా నేదు, రాముప్పంతులు బాబూ నేడు. ఇద్దరూ సచ్చి సొరగాన్నున్నారు." అని చెప్పారు.

'మూడవ ప్రపంచయుద్ధం వస్తుందా' అని ప్రశ్నించగా—"అమ్మోరుకు పొరంయెట్టి, జాతర సెయ్యక పోతే యుద్ధాలాకమాస్తాయా?" అని ఎదురుప్రశ్న వేశారు!

తరవాత శ్రీగిరీశంగారు సపరివారంగా విడిదికి వెంచేశారు.

